జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

దేవరుప్పుల, అక్టోబర్ 5: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఇంటర్ బోర్డు జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణాకర్, అధ్యాపకులు రాధిక, చైతన్య, రహీమున్నీసా, హరితకుమారి, అనురాధ, భవాని, ఆదర్శ, రవీందర్, శశిధర్, ఉదయ్, మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా దేవీ నవరాత్రోత్సవాలు

బచ్చన్నపేట, అక్టోబర్ 5 : మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి సంప్రదాయ రీతిలో పూజలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు శనివారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బచ్చన్నపేట, ఆలీంపూర్, కొన్నె, పోచన్నపేట, కట్కూర్, కేశిరెడ్డిపల్లి, సాల్వాపూర్, చిన్నరామన్‌చర్ల, నాగిరెడ్డిపల్లిలో నవ రాత్రోత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు.

ప్రముఖ విద్యావేత్త గౌస్ మోహియొద్దీన్ మృతి

మోహియొద్దీన్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, చైతన్య జూనియర్ కళాశాల వ్యవస్థాపకుడు గౌస్ మోహియొద్దీన్ (72) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో మృతి చెందారు. మృతుడుకి భార్య ఖమరున్నీసా, కుమారులు గయాస్, ఆవేస్, సజ్జాద్, కుమార్తెలు ఫరహత్, డాక్టర్ మునావర్ ఉన్నారు. పట్టణ ప్రజలందరితో పరిచయాలున్న గౌస్ విద్యారంగంతో పాటు లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థల ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పుర ప్రముఖులు, ప్రజలు గౌస్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయంత్రం స్థానిక గిర్నిగడ్డ ఖబరస్థాన్‌లో గౌస్ అంత్యక్రియలు జరిగాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్ తహసీల్దార్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ఓటు నమోదు కేంద్రం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 5 : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం పదవీ కాలం వచ్చే మార్చితో ముగుస్తున్నందున, అనంతరం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఉపాధ్యాయులు తమ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

SHUTTERS FOR SALE

★ హనుమకొండ చౌరస్తా మహేంద్ర క్లాత్ షోరూం ప్రక్కన గల్లీలో SSN Reddy కాంప్లెక్స్ నందు 1st ఫ్లోర్‌లో 3 కమర్షియల్ షట్టర్స్ అమ్మకానికి కలవు. సంప్ర|| సెల్: 8686778662.
NTW-326423

DASARA OFFER

★ Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516.
NT-333073

HOUSE FOR SALE

★ కాకతీయ యూనివర్సిటీ దగ్గర్లో, Reliance Samrt Point కి సమీపంలో North East Facingలో గల G+1 ఇల్లు (221 Sq.yds) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 8985947319.
NTW-000

WANTED PLOTS

★ హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Broakers. 9553973999 / 6303049720.
NT-336725-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

PLOT FOR SALE

★ యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్ అన్ని వసతులతో. Contact: 8106340199.
NT-333076

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565

ఎల్ఆర్ఎస్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : భూముల లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సర్వే చేసి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. స్వీకరించిన దరఖాస్తులు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలకు సంబంధించినవి అవునో, కాదోనన్న విషయాన్ని నిర్ధారించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏ సర్వే నంబర్‌లో ఎక్కువ దరఖాస్తులు ఉన్నాయో, అక్కడికి సంబంధిత మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని ఆదేశించారు. జనగామ మున్సిపల్‌కు సంబంధించి మొత్తం 12,552 దరకాస్తులు స్వీకరించగా, 144 దరకాస్తుల సర్వే పూర్తయిందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. సర్వే నంబర్లన్నింటిని క్రమ పద్ధతిలో ట్రాకింగ్ షీట్‌గా పెట్టుకోవాలని సూచించారు. ఎంత మంది దరఖాస్తుదారులు స్పందించారు? బృంద సందర్శన ఎప్పుడు జరిగింది? పేమెంట్ అయ్యిందా, లేదా? తదితర వివరాలన్నింటిని ఎప్పటికప్పుడు ఆ ట్రాకింగ్ షీట్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్డీవో కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. శనివారం ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు కోసం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, మీడియా కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఉపాధ్యాయులు సంప్రదించాలని సూచించారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయాలు, 12 మండలాల తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో కూడా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి

జనగామ చౌరస్తా/పాలకుర్తి, అక్టోబర్ 5 : దివంగత మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలు శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేదలు, దళితుల అభ్యున్నతి కోసం వెంకటస్వామి కృషి చేశారని తెలిపారు. దళితుడిగా పుట్టి అంచెలంచెలుగా కేంద్ర మంత్రి స్థాయి వరకు ఉన్నత పదవులు చేపట్టిన మహోన్నత వ్యక్తి వెంకటస్వామి అని కొనియాడారు. వారి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి రవీందర్, డీఏవో రామారావు, డీవైఎస్‌వో వెంకట్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్, చేనేత జౌళిశాఖ అధికారి చౌడేశ్వరి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పాలకుర్తి తహసిల్ ఆఫీస్‌లో గడ్డం వెంకటస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో అవుల రాములు, ఆర్ఐ రాకేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చండీహోమం

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి దంపతులు

హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి దంపతులు

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 5: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి-రాజా రామ్మోహన్‌రెడ్డి దంపతులు చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక కల్యాణం కోసమే మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించామని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో పాడి పంటలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.

దయాకర్‌రావు గారూ.. సలహాలు ఇవ్వండి

పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గారు సలహాలు ఇవ్వాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి కోరారు. దయాకర్‌రావు వయస్సులో పెద్దవారు.. విమర్శలు కాకుండా సలహాలు, సూచనలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని తెలిపారు. రైతుల పంటరుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. బీఆర్ఎస్ నాయకులు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, హనుమండ్ల తిరుపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, హమ్యానాయక్, మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నల్ల శ్రీరాములు, గిరగాని కుమారస్వామి, ధరవత్ సురేశ్‌నాయక్, నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, బైర్ భార్గవ్, జలగం కుమార్, కారుపోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రూజర్ యూనియన్ అధ్యక్షుడిగా సుమన్‌రావు

సుమన్‌రావు

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 5: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి క్రూజర్స్, అండ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా మండలంలోని దర్దేపల్లికి చెందిన దుగ్యాల సుమన్‌రావు ను ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వంగ ఆశోక్, ఉపాధ్యక్షుడిగా అంబటి సమ్మ య్య, ప్రధాన కార్యదర్శిగా వీరమనేని యాకాంతారావు, సహాయ కార్యదర్శిగా బీ సోమ్లానాయక్, కోశాధికారిగా కమ్మగాని శోభన్‌బాబు, సలహా సంఘం సభ్యులుగా బత్తుల సాంబరాజు, గాదె సోమిరెడ్డి, బాలగాని వెంకటేశ్, పూజారి వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

పీహెచ్‌సీలకు ఫార్మాసిస్టుల నియామకం

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

రఘునాథపల్లి పీహెచ్‌సీలో ఫార్మాసిస్టు వెంకటకృష్ణ

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 5 : ఎట్టకేలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మాసిస్టులను నియమించారు. గత నెల 3న నమస్తే తెలంగాణలో 'ఇక్కడ ఫుల్.. అక్కడ నిల్..' శీర్షికన పీహెచ్‌సీల్లో ఫార్మాసిస్టుల కొరతపై ప్రచురితమైన కథనానికి వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. స్టేషన్‌ఘన్‌పూర్ దవాఖానలో ఫార్మాసిస్టులు ఉన్నప్పటికీ, రఘునాథపల్లి, లింగాలఘనపురం మండలాల్లోని పీహెచ్‌సీల్లో ఫార్మాసిస్టులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్న వైనంపై డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో వెంకటకృష్ణను రఘునాథపల్లి మండలానికి, కే స్రవంతిని లింగాలఘనపురం పీహెచ్‌సీకి ఫార్మసిస్టుగా బదిలీ చేయగా ఆదివారం వారు విధుల్లో చేరారు.

నేడు బీఆర్ఎస్ మండల ఆత్మీయ సమావేశం

లింగాలఘనపురం, అక్టోబర్ 5 : బీఆర్ఎస్ మండల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నెల్లుట్లలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరవుతారని తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, మండల కమిటీల బాధ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జిల్లా పంచాయతీ అధికారి స్వరూపారాణి

బచ్చన్నపేటలో సర్టిఫికెట్లు అందిస్తున్న స్వరూపారాణి

నర్మెటలో సర్టిఫికెట్లతో సిబ్బంది

బచ్చన్నపేట, అక్టోబర్ 5 : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులతో పాటు సిబ్బంది భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులు శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో శనివారం ముగింపు సమావేశం జరిగింది. ఎంపీడీవో మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామాల్లో వీధులు, డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారని అన్నారు. మంచినీటి సహాయకులు మిషన్‌భగీరథ ద్వారా నీటిని ట్యాంకుల్లో నింపి ప్రజలకు ప్రతి రోజూ అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఏఈ గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట : తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని మిషన్ భగీరథ ఈఈ వీ శ్రీకాంత్ అన్నారు. గ్రామాల్లోని మంచినీటి సహాయకులకు మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో శనివారం ముగింపు సమావేశం నిర్వహించారు. శిక్షణ పొందిన వారికి అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరవింద్ చౌదరి, ఏఈ ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్‌లో..

జనగామ రూరల్ : గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని మిషన్ భగీరథ ఏఈ ప్రేమలత అన్నారు. శనివారం జనగామలోని ఎంపీడీవో కార్యాలయంలో తాగునీటి సహాయకులతో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. తాగునీటి పైపులైన్ల లీకేజీకి మరమ్మతులు చేపట్టడంతోపాటు మోటర్లు, స్టార్టర్స్ రిపేరుకొస్తే బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సహాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు పలువురి శుభాకాంక్షలు

తహసీల్దార్ రవీందర్‌కు అభినందనలు తెలుపుతున్న వంశీధర్‌రెడ్డి

లింగాలఘనపురం, అక్టోబర్ 5 : తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌ను మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లూరి శివకుమార్, కీసర దిలీప్‌రెడ్డి, దామెర నాగరాజు, కృష్ణమూర్తి, బుషిగంపల అంజనేయులు, పిట్టల రాజు, ఎండీ అబ్బాస్, కొత్తకొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గించాలి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 5 : కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగూడెంలో రెండు రోజులు జరిగిన ఆ పార్టీ మహాసభలకు ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడి నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరిగాయన్నారు. జిల్లా నాయకులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు కోడెపాక యాకయ్య, గ్రామ కార్యదర్శి గట్ల మల్లారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల గిరిప్రదక్షిణ

జఫర్‌గఢ్‌లో గిరి ప్రదక్షణకు వెళ్తున్న భక్తులు

జఫర్‌గఢ్, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని పడమటి కొండపై వెలిసిన శ్రీ వేల్పుగొండ లక్ష్మీ నరసింహస్వామి వారి గుట్ట చుట్టూ భక్తులు శనివారం గిరిప్రదక్షిణ చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన లక్ష్మీ నరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా మైసూరు దత్తపీఠం భక్తుడు పల్లా సుధాకర్ గత శ్రావణ మాసంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ చేపట్టగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ చేస్తే లక్ష్మీ నరసింహస్వామి వారి అనుగ్రహం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తున్నట్లు పల్లా సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, శ్రవణ్‌కుమార్, జ్యోతి యాకయ్య, సోమేశ్వర్, నర్సయ్య, సోమయ్య, రాజ్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్, విజయ్, నాగరాజు, సతీశ్, రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

సాయిప్రియ

చిల్పూరు, అక్టోబర్ 5 : మండలంలోని పల్లగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కోల సాయిప్రియ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 7 నుంచి 8 వరకు హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలకు హాజరుకానుంది. దీనికి సంబంధించిన వివరాలను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జే దేవ్‌సింగ్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 3న జిల్లా కేంద్రంలోని ధర్మకంచ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్‌లో ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. సాయిప్రియను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్, జిల్లా బాధ్యులు ఆవుల అశోక్, వంచ చంద్రశేఖర్ రెడ్డి, రంజిత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతిడి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మృతుడి కుటుంబ సభ్యులకు బియ్యం అందిస్తున్న యూత్ సభ్యులు

తరిగొప్పుల, అక్టోబర్ 5 : మండల కేంద్రానికి చెందిన మంచినీళ్ల శాంతమ్మ, బొల్లు మార్కండేయ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న రెయిన్‌బో యూత్ అధ్యక్షుడు అంకం రాజు మృతుల కుటుంబాలను శనివారం పరామర్శించారు. మంచినీళ్ల శాతమ్మ కుటుంబానికి రూ.5 వేలు, బొల్లు మార్కండేయ కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. కుటుంబాలకు అండగా ఉంటామని రాజు పేర్కొన్నారు. యూత్ బాధ్యులు జొన్నగోని రవీందర్ గౌడ్, రాజు, అనూప్, హరిప్రసాద్, అక్తర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జఫర్‌గఢ్, అక్టోబర్ 5 : మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన కస్తూరి రవి(55) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాదెపాక చిరంజీవి, రాజిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

పాలకుర్తిలో చాకలి ఐలమ్మ, కడవెండిలో దొడ్డి కొమురయ్య స్థూపాల వద్ద సీపీఎం నేతల నివాళులు

సాయుధ పోరాట వీరులకు కేరళ బృందం నివాళులు

దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ నడయాడిన స్థలాలను పరిశీలించిన సీపీఎం నేతలు

దేవరుప్పుల/పాలకుర్తి, అక్టోబర్ 5: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించిన అమరవీరులు దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, చాకలి ఐలమ్మ నడయాడిన ప్రాంతాల్లో శనివారం కేరళకు చెందిన సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించింది. దేవరుప్పుల మండలం కడవెండిలోని దొడ్డి కొమురయ్య, కామారెడ్డిగూడెంలో షేక్ బందగీ, ధర్మాపురంలోని జాటోత్ థానూనాయక్, పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన వీరనారి చాకలి ఐలమ్మ స్థూపాలను సందర్శించి నివాళులర్పించారు. కేరళకు చెందిన జితేశ్ నేతృత్వంలో సీపీఎం బృందం తెలంగాణ సాయుధ పోరులో చరిత్రాత్మక ఘట్టాలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. ఎస్‌డబ్ల్యూయూఎఫ్ జిల్లా నాయకులు జే నాగేశ్వర్‌రావు, రాయల శ్రీనివాస్‌రావు, జక్కంపూడి కృష్ణ కేరళ బృందానికి నాటి పోరాటాన్ని వివరించారు. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముఖ్యమైనదని వారు పేర్కొన్నారు. జాటోత్ థానూనాయక్‌కు స్వయాన తమ్ముడు శతాధిక వృద్ధుడైన జాటోత్ దర్గ్యానాయక్‌ను కేరళ ప్రతినిధి బృందం కలిసి మాట్లాడింది. ఈ సందర్భంగా దర్గ్యానాయక్‌ను ఘనంగా సన్మానించింది. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో తన అన్నతో కలిసి పోరాడి తీరు, జైలు జీవితం, నాటి ప్రజా ఉద్యమాలను దర్గ్యానాయక్ వివరించారు. అనంతరం సీపీఎం కేరళ నాయకులు మాట్లాడుతూ మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో లిఖించబడిందన్నారు. పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా అధికారంలోకి రావాలని అందరూ కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ వ్యవహరించారు. ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేశ్, పాలకుర్తి, చిల్పూరు మండలాల కార్యదర్శులు మాచర్ల సారయ్య, సాదం రమేశ్, నాయకులు చిట్యాల సోమన్న, దొడ్డి భిక్షపతి, బత్తిని వెంకన్న, ఐలన్న, గొడిశాల రాములు తదితరులు పాల్గొన్నారు.

డీజేలు నిషేధిస్తే ఉపాధి కోల్పోతాం

సర్కారు పునరాలోచించాలని ఎమ్మెల్యేకు పలువురి వినతి

దేవరుప్పుల, అక్టోబర్ 5 : డీజేలను నిషేధిస్తే ఉపాధి కోల్పోతామని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి డీజే సౌండ్స్ యూనియన్ సభ్యులు అన్నారు. తమ సమస్యలపై శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి డీజే, సౌండ్స్ సిస్టమ్ కొనుగోలు చేసుకుని ఉపాధి పొందుతున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో తమకు ఉపాధి కరువవుతుందన్నారు. డీజేల నిషేధాన్ని ఎత్తేయాలని, దీనిపై ప్రభుత్వం చర్చించాలని వారు కోరారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా భూక్యా సుధాకర్ నాయక్, ఉపాధ్యక్షుడిగా మహేశ్, కార్యదర్శిగా సతీశ్‌ను ఎన్నుకున్నారు.

ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్



సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : టీజీ డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్, భాషోపాధ్యాయ, సెకండరీ గ్రేడ్ టీచర్, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 534 మంది అభ్యర్థులకుగాను 516 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనట్లు తెలిపారు. మరో 18 మంది అభ్యర్థులు రెండు రకాల పోస్టులకు అర్హత సాధించడం వల్ల ఒక్క పోస్టుకు మాత్రమే హాజరై మిగతా పోస్టుకు అటెండ్ కాలేదని పేర్కొన్నారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 12 మంది పంచాయతీ కార్యదర్శులు సైతం ఉపాధ్యాయ కొలువుకు అర్హత సాధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై వారి మాతృశాఖ నుంచి 'నో ఆబ్జెక్షన్' సర్టిఫికెట్లను కూడా సమర్పించారు. శనివారం రాత్రి వరకు కూడా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగింది.